డెంగీ నివారణకుప్రతి ఒక్కరూ కృషి చేయాలి



అవగాహన ర్యాలీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

నల్లకుంట: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నిరంజన్ సూచించారు. పగటిపూట మాత్రమే కుట్టే డెంగీ దోమ ప్రమాదకరమని ప్లేట్‌లెట్స్ బాగా తగ్గి ప్రాణానికే ప్రమాదం వస్తుందన్నారు. హైదరాబాద్ వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి మలేరియా విభాగం, తిలక్‌నగర్, బాగ్ అంబర్‌పేట యూపీహెచ్‌సీలలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి హాజరైన జిల్లా వైద్యాధికారి నిరంజన్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. డెంగీ నిర్మూలన, పరిశుభ్రత గురించి పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ నియంత్రణలో భాగస్వాములమవుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు. తిలక్‌నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ అధికారిని డాక్టర్ దీప్తి పటేల్, కాచిగూడ హర్రాస్ పెంట డాక్టర్ ఎస్.మౌనిక, బాగ్ అంబర్‌పేట వైద్యాధికారిని డాక్టర్ హరిశ్రీ, జీహెచ్ఎంసీ ఎస్ఈ దుర్గాప్రసాద్, ఆరోగ్య పరిశీలకులు శ్రీనివాస్, ఎంపీహెచ్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఏఎన్ఎంలు తదితరులున్నారు.

జాగ్రత్త అవసరం..

ముషీరాబాద్: డెంగీ వ్యాధి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ దీప్తిప్రియాంకా పేర్కొన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జీహెచ్ఎంసీ, ఎంటమాలజీ సూపర్‌వైజర్ యాదగిరి ఆధ్వర్యంలో డెంగీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒంటినొప్పులు, కండరాల నొప్పి, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే అజాగ్రత్త చేయకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. డెంగీ వ్యాధికి నివారణ మార్గాలే రక్షణ చర్యలని ఆమె పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు..

కాచిగూడ: ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న కేసుల్లో వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయని, వైరల్ జ్వరాలను కూడా డెంగీగా భావించి ప్రజలు ఆందోళన చెందొద్దని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇసామియాబజార్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య సిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి జ్వరం డెంగీ కాదన్నారు. తల్లిదండ్రులు వైరల్ ఫీవర్లపై కనీస అవగాహన ఉంటే పిల్లలు జ్వరాల భారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. జ్వరం వచ్చినప్పటికీ వారికి ఉన్న అవగాహనే మందుగా పనిచేస్తుందన్నారు. ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ పద్మజ, డీపీఎంఓ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సునీల్ రెడ్డి, నర్సు బాయి, రామలక్ష్మి, విజయమ్మ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రమాణం చేయిస్తున్న వైద్యాధికారి డాక్టర్ నిరంజన్, యూపీహెచ్‌సీ వైద్యులు


ముషీరాబాద్ ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక, జీహెచ్ఎంసీ సిబ్బంది

నీటి సరఫరా సమస్య తీరేనా ?

- కలుషిత నీటి సరఫరాతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నల్లకుంట: నగర ప్రజలకు సురక్షిత తాగునీటిని అందిస్తున్నామని జలమండలి అధికారులు చెబుతున్నారు. కానీ చాలా ప్రాంతాల్లో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో జలమండలి అధికారుల మాటలు, చేతలకు పొంతనేలేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖ అధికారుల అలసత్వం, నిర్లక్ష్యంతో చాలా ప్రాంతాల్లో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమవుతోందనే ఆరోపణలున్నాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రజలు ఆ కలుషిత నీటినే వినియోగిస్తూ.. రోగాల భారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. దీనిపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




తవ్వి వదిలేసిన పైపులైన్ పనులు

- నల్లా ద్వారా కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నా.. విధిలేని పరిస్థితుల్లో బయట నీరు కొనుక్కొని తాగుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు జలమండలి అధికారులను కోరుతున్నారు.
- కలుషిత నీటి సరఫరా సమస్యను తెలుసుకునేందుకు ఇటీవల పైపులు తవ్వి చూశారని కలుషిత నీటి సరఫరా సమస్యను కనిపెట్టలేక పోయారని స్థానికులు చెబుతున్నారు.

మురుగు నీరే గతి..



పాత నల్లకుంటలో గత రెండు నెలలుగా నల్లా నుంచి మురుగు నీరు సరఫరా అవుతోంది. జలమండలి అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కనీసం ట్యాంకర్లతో తాగునీటిని పంపించడం లేదు. దుర్వాసన ఉన్న నీటిని తాగలేక బయట నుంచి నీరు కొనుక్కుని తాగుతున్నాం.

– దాసు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు

శాంపిల్ల సేకరణ..

స్థానికుల ఫిర్యాదుతో గురువారం ఉదయం డాక్టర్ చారీలేన్‌లో పర్యటించిన జీహెచ్ఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత నల్లా నీటి శాంపిళ్లను సేకరించారు. నీటి నాణ్యతా ప్రమాణాలు పరిశీలిస్తామని ఆమె చెప్పారని వివరించారు.

వాసన వచ్చే నీటిని ఎలా వాడాలి.. ?



డాక్టర్ చారీలేన్‌లో గత ఏడాదిన్నరగా కుళాయి ద్వారా కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మొక్కుబడిగా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కానీ శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదు. దుర్వాసన వచ్చే నీటిని తాగలేక పోతున్నాం. నిత్యం డబ్బు పెట్టి కొనుక్కుని నీరు తాగాలంటే కష్టమే.

– గంట లక్ష్మణ్, నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు

గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి..



గత రెండేళ్లుగా కుళాయిల ద్వారా డ్రైయిన్ నీరు కలిసి వస్తుంది. దుర్వాసన వచ్చే నీటిని ఎలా వాడాలి. ఈ నీటిని తాగలేకపోతున్నాం. డబ్బుపెట్టి తాగునీరు కొనుక్కుని తాగాలంటే కష్టమే. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి కలుషిత నీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– పీఎస్. చారి, నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


గుజ్జ సత్యం

కాచిగూడ: కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీ కులగణన అనంతరం రిజర్వేషన్లను 50 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థలు ఎన్నికలు జరపాలన్నారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 50 శాతానికి రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీలు పెద్దఎత్తున ఉద్యమిస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు 22 నుంచి 42 శాతానికి పెంచుతామని పేర్కొన్నారు. బీసీల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ అమలు చేసి మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులు అధికంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం హామీని నెరవేర్చాలి


ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: స్థానిక సంస్థల ఎన్నికలు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, ఈ హామీ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని గురువారం ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

19న ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్

కాచిగూడ: 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్' (నిఫ్డ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.రాముయాదవ్ గురువారం తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో చేరేందుకు మే 19వ తేదీన ఆదివారం కొత్తపేటలోని ఇనిస్టిట్యూట్‌లో ఉచిత స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఫ్యాషన్ గార్మెంట్ మేకింగ్, డిజైనింగ్, ఇలస్ట్రేషన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, ప్యాట్రన్ మేకింగ్, ప్యాబ్రిక్ కటింగ్, గార్మెంట్ కన్‌స్ట్రక్షన్ తదితర విభాగాల్లో 3 నెలలు, 6 నెలలు, ఏడాది డిప్లొమా కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు మే 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9030610033/55.

పర్యావరణంపై ఆన్‌లైన్ పోటీలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ పరిరక్షణపై పాఠశాల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచనపై ఆన్‌లైన్ పోటీ నిర్వహిస్తున్నామని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య తెలిపారు. 'ఈ భూమిని, ప్రకృతిని ఎలా కాపాడుకుందాం..' అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఇంటి వద్ద కుటుంబసభ్యుల సహకారం తీసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన బొమ్మ, లేదా వ్యాసాన్ని ఆన్‌లైన్‌లో పంపాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.6 వేలు, మూడో బహుమతి రూ.3వేలతో పాటు మరో 10 మందికి వేయి రూపాయల చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సంస్థ నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8179019623.

భిన్నత్వంలో ఏకత్వమే కుటుంబం

డాక్టర్ ఇప్నో పద్మాకమలాకర్


విద్యార్థులతో ఇప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ: భిన్నత్వంలో ఏకత్వమే కుటుంబమని ప్రోగ్రెసీవ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ ఇప్నో పద్మాకమలాకర్ అన్నారు. గురువారం అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవం సందర్భంగా రామకృష్ణమఠంలో యోగానంద రఘుమహారాజ్, నవభారత లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో 'కుటుంబాలు – వాతావరణ మార్పులు' అనే అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు, ఫ్యాన్సీడ్రస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా కుటుంబాలను ప్రభావితం చేస్తున్న అంశాలపై అందరికి అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ 1983లో మే 15న అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అన్ని బంధాలను సమన్వయం చేసుకుని, అందరితో కలివిడిగా ఉంటూ.. ఎవరినీ కించపరిచేలా, హేలన చేసే విధంగా మాట్లాడొద్దన్నారు. దృఢంగా ఆత్మవిశ్వాసంతో ఆత్మాభిమానాన్ని కాపాడుకోవాలన్నా.. కుటుంబమే ఉండాలన్నారు. నమ్మకాలకు విలువనిస్తూనే కుటుంబ విలువలను గౌరవించాలన్నారు. కుటుంబ బంధాలు పదిలంగా ఉంటేనే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండగల్గుతామని, ఉద్యోగరీత్యా తీరికలేకపోయినా కుటుంబానికి సమయాన్ని కేటాయిస్తూ.. కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎడ్ల నారాయణరెడ్డికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తండ్రి ఎడ్ల నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతికి పలువురు హాజరై నివాళులర్పించారు. గురువారం ఛే నంబర్ చౌరస్తాలోని ఆయన నివాసంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి అంజలి ఘటించారు. వివిధ పార్టీల నేతలు రవీందర్‌రావు, హరినాథ్‌రెడ్డి, కట్టెల సుభాష్, విజితరెడ్డి తదితరులున్నారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి

కాచిగూడ: నడుస్తున్న రైల్లో నుంచి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల ప్రాంతానికి చెందిన రమేష్ (45) మేస్త్రీ పనిచేస్తుంటాడు. గురువారం హంద్రినీవా ఎక్స్‌ప్రెస్ రైల్లో షాద్‌నగర్ నుంచి కాచిగూడకు వస్తుండగా.. రైలు బోగి డోర్ వద్ద నిల్చుని ఉండగా.. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

కాచిగూడ: విద్యా సంవత్సరం పూర్తయినా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఉన్నత విద్యకు విద్యార్థులు దూరమయ్యే ప్రమాదముందని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వస్తుందనే ఉద్దేశంతోనే అధిక సంఖ్యలో నిరుపేద బీసీ విద్యార్థులు ప్రైవేట్ కాలేజీల్లో చేరుతున్నారన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, పీజీ తదితర కోర్సులకు సమయానికి హాల్ టికెట్లు ఇవ్వకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థుల పరీక్షలపై ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు, పరీక్షలకు హాజరయ్యేందుకు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని దీంతో విద్యార్థులు మధ్యలోనే చదువును ఆపేయాల్సి వస్తుందన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థుల చదువుల కోసం వారి తల్లిదండ్రులు ఫీజులు చెల్లించలేక పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్ వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం నేతలు అనంతయ్య, చంద్రశేఖర్, దివ్య, శిరీష, స్వాతి, రేఖ, ప్రశాంతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ప్రత్యేక గుర్తింపు


విద్యార్థినిని అభినందిస్తున్న వెంకటేశ్వర్లు ముదిరాజ్

కాచిగూడ: విద్యార్థులకు విద్యతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. బైపీసీలో 91 శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన చెల్లా ప్రగతి తులసిని గురువారం ఆయన అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. విద్యార్థి దశలోనే తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎదురయ్యే అవరోధాలను అధిగమించి విజయాలు సాధించేందుకు సిద్ధం కావాలన్నారు. ప్రతి వ్యక్తి రిస్క్ తీసుకుంటేనే విజయాలు సాధించి, ఉన్నత స్థానాల్లో నిలుస్తారని పేర్కొన్నారు. సతీష్ ముదిరాజ్, శ్రీనివాస్, రాజేష్, ప్రదీప్, లక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తేనే ఉత్తమ ఫలితాలు



27వ ర్యాంకర్ నందాల కిరణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించవచ్చని ఆల్ ఇండియా 27వ ర్యాంకర్ నందాల కిరణ్ సివిల్స్ అభ్యర్థులకు సూచించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని 'విజన్ ఐఏఎస్' ఆధ్వర్యంలో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం గురువారం యూపీఎస్సీ ప్రిపరేషన్ సెమినార్, టాపర్స్ టాక్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందాల సాయికిరణ్ హాజరై సివిల్స్ అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సివిల్స్ లక్ష్యంగా పెట్టుకుని క్రమశిక్షణతో చదవాలని సూచించారు. మెయిన్స్ ప్రిపరేషన్‌లో మొత్తం సిలబస్‌ను పూర్తి చేయాలని పేర్కొన్నారు. విజన్ ఐఏఎస్ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ కృష్ణసింగ్ ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ..

ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి

నల్లకుంట: రాత్రిపూట రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అడ్మిన్ ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న రాత్రి 10.30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి (38) విద్యానగర్ హిందీ మహావిద్యాలయ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని కారు ఆ వ్యక్తిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలు కాగా.. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో అతడు మృతి చెందాడు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. సంబంధీకులెవరైనా నల్లకుంట పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

మృగశిర కార్తెకి చేపల పండగ నిర్వహించాలి

పంజగుట్ట: త్వరలో మృగశిర కార్తె రానున్న నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో చేపల పండగ (ఫిష్ ఫెస్టివల్) నిర్వహించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ... మత్స్యకారులకు గతంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉచిత చేపపిల్లల పంపిణీ చేసేవారన్నారు. ఈసారి కూడా కొనసాగించాలని కోరారు. చేపల పంపిణీలో ఏవైనా లోటుపాట్లు ఉంటే రాష్ట్రంలోని మత్స్య సహకార సొసైటీలను నేరుగా నగదు పంపిణీ చేయాలని కోరారు.

భారీ వర్షం.. కాలనీలు అతలాకుతలం

- వర్షందాటికి పడిపోయిన భారీ వృక్షాలు
- పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ప్రజా ప్రతినిధుల చొరవతో పునరుద్ధరణ


జలమయమైన రహదారి

అంబర్‌పేట: వర్షం బీభత్సం సృష్టించింది.కురిసిన వర్షానికి జనజీవనం అతలకుతాలమైంది. గురువారం కురిసిన వర్షానికి అంబర్‌పేటలో రోడ్లు అన్ని జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలకు భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. నాలా పరీవాహక ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి వచ్చింది. ప్రజలు వర్షంతో తీవ్ర అవస్థలు పడ్డారు.

కాచిగూడ: బర్కత్‌పురలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో భారీ చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో రోడ్లపై ఎవరూ లేకపోవడంతో ఏలాంటి ప్రాణ నష్టం జరగలేదు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. రోడ్లపై విరిగి పడిన చెట్లను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందిని, డిఆర్ఎఫ్ సిబ్బందిని పిలిపించి తొలగింప చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా విరిగిపడిన చెట్ల కొమ్మలను పక్కన వేశారు. రోడ్లపై పెద్ద పెద్ద వృక్షాలు చాలా ఉన్నాయని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కూలిపోయే ప్రమాదం ఉన్న చెట్లను తొలగింపచేయాలని స్థానిక ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరగక ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు.


గోల్నాక శంకర్‌నగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: ముషీరాబాద్, భోలక్‌పూర్‌లో గురువారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షం నీళ్లు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్, రాజాడిలక్స్ చౌరస్తా, ముషీరాబాద్ డివిజన్‌లోని పార్సిగుట్ట, వినోభానగర్, బాపూజీనగర్‌లలో వర్షం నీళ్లు ఇండ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షం నీళ్లు రోడ్లపై నిలిచిపోవడం వల్ల వాహనాదారుల రాకపోకలు నిలిచిపోయాయి. తోప్పుడు బండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంగపుత్ర కాలనీ, వీఎస్‌టి రోడ్డులలో చెట్టు కొమ్మలు విరిగి కిందపడ్డాయి. సుమారు నాలుగు గంటలు పడ్డ భారీ వర్షానికి ప్రజలు అతలాకుతలం అయ్యారు. ఇదిలా ఉంటే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర ఉక్కపోత, ఎండతో ఇబ్బంది పడ్డ ప్రజలకు చల్లటి గాలులతో ప్రజలు ఉపసమనం పొందారు.

కవాడిగూడలో..

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వల్ల వాహన దారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల ప్రాగాటూల్స్, పద్మశాలికాలనీ రోడ్డు, ఇందిరాపార్కు, గాంధీనగర్ లింక్‌బ్రిడ్జ్ కోదండరెడ్డి నగర్, లోయర్‌ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాలలో మోకాళ్ల లోతు వర్షం నీరు రోడ్లపై ప్రవహించడంతో ఈ దారి గుండా వచ్చే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనేక మంది వాహనదారులు వరదనీటి నుంచే వెళ్లేందుకు ప్రయత్నించగా వాహనాలు ఆగిపోవడంతో నానా ఇబ్బందులు పడ్డారు. మొదట ఈదురు గాలులతో మొదలై, భారీ వర్షంగా మారడంతో కవాడిగూడ డివిజన్ పరిధిలో పలు బస్తీలు, కాలనీలు జలమయం అయ్యాయి. రోడ్లపై నిలిచిపోయిన వరద నీరు వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ అధికారులు రంగంలోకి దిగడంతో ట్రాఫిక్ సమస్య తీరింది.

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి లేబర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న భారీ చెట్టు కొమ్మలు విరిగిపడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లేబర్ కార్యాలయంలో నీళ్లు నిలిచిపోవడంతో చెరువును తలపింపజేసింది. గురువారం రోడ్లపై మార్కెట్ ఉండటంతో ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ జనతా పార్క్ , సుధాహోటల్ లేన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ డీఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. బీజేపీ నేతలు శివకుమార్, ఆకుల సురేందర్, ఆనంద్‌రావు, ప్రశాంత్‌లు, గాంధీనగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, కుమారస్వామి, రాము పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయం వద్ద..


బర్కత్‌పుర ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద రోడ్డుపై విరిగిపడిన చెట్టు


గాంధీనగర్ లింక్ బ్రిడ్జిపై..


లేబర్ కార్యాలయంలో..